# 5

## సద్యః ఫలితం

క్రోర్టు హాలు జనంతో కిటకిట లాడుతోంది.

మేస్ట్రీటుగా రొచ్చి, గద్దె అలంకరించటంతోనే అంతవరకూ వినపడుతోన్న గుసగుసలన్నీ అతాత్తుగా ఆగిపోయి హాలంతా నిశ్శబ్దమైంది. స్విచ్చినొక్కిన తక్షణం ఎలెక్ట్రిక్ పంకా తిరగటం మొదలెట్టినట్లు ఆ అధికారి కుర్చీలో కూర్చునీ కూర్చోటంతోనే నాటి కార్యక్రమం ఆరంభ మైంది.

మొదట విచారించవలసిన కేసు జయలక్ష్మి అనే అమ్మాయి ప్రకాశరా వనే యువకునిపైన తెచ్చింది. ప్రకాశరావు కోర్టువారి యెదుట హాజరై నిలబడ్డాడు. "ఫిర్యాది తరఫు ప్లీడరెవరు?" అనే ప్రశ్న వచ్చేసరికి జయలక్ష్మి లేచి చేతులు జోడించి—

"నాకు ప్లీడరెవరూ లేరని కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను. ప్లీడర్ని పెట్టుకునే స్తోమతు నాకు లేదు. 'నా' అన్నవారెవరూ లేక స్వయంగా ఆర్జించుకోవలసి వచ్చి, మందుల కంపెనీకి యేజంటుగా చేరేను". అని చెప్పుతుంది.

"అయితే మీ కేసు మీరే వాదించుకుంటారా?"

"చిత్తం. పెద్ద వాదన కేముందండీ? నాకు ముద్దాయి వల్ల జరిగిన అపచారం రెండుముక్కల్లో కోర్టువారికి మనవిచేసుకోవడమే."

"అయితే కానివ్వండి."

"నేను మందుల కంపెనీకి యేజంటునని కోర్టువారికి మొదటనే మనవిచేశాను."

"ఏ కంపెనీ అది?"

"కోర్టువారు వినే ఉంటారు ఆ కంపెనీ పేరు. ప్రఖ్యాతి వహించిన 'సద్యోగుణ ఔషధాలయం.' పెద్ద పట్టణాలన్నింటిలోనూ ఈ కంపెనీకి బ్రాంచీలున్నాయి. బ్రాంచీలు లేనిచోట్ల ప్రజలకి వీలుగా ఉండటంకోసం, ఈ కంపెనీ తను ఏజంట్లను పంపి, మందులమ్మిస్తుంది. నాకు నెలకు 200 రూపాయలు జీతం, ట్రావెలింగు ఖర్చులూ ఇస్తారు. అమ్మకంమీద రూపాయకు పావలా కమిషనూ ఇస్తారు. ఈ ఊరివారికి మందులు సప్లైచేసే వంతు నాకు వచ్చింది."

ఈ ఉపోద్ఘాతం అయాక, జయలక్ష్మి ఒకక్షణం ఆగి, మళ్ళీ ప్రారంభించింది:

"నే నీ పురం రావటంతోనే బండివాడు చెప్పిన సలహా

మీద, ఊరిముఖగనున్న సత్రంలో బసచేశాను. అక్కడ ఓ గదిలో ముద్దాయి కాగితా లేవో చూసుకుంటూ కూర్చు న్నాడు. గదికి వెనకాలే వంటగది మరొకటుంది. ఆ గదికీ, ముద్దాయి కూర్చున్న గదికీ మధ్యనున్న ద్వారం తెరిచే ఉంది. వంటగదిలో ముద్దాయి బాపతు ఆడవాళ్ళెవరైనా ఉన్నారేమో అని దూరాన్నుంచి పరికించాను..."

"ఎందుకోసం?"

"మనవిచేసుకుంటున్నాను. అమ్మకాని కంటూ తిరుగు తోన్నప్పుడు, స్త్రీపురుషవివక్షత లేకుండా కొంటారని తోచినవాళ్ళకల్లా మందులు చూపవలసిందే. కాని నేను పూర్వసంప్రదాయాలకు చెందిన కుటుంబంలోనిదాన్నవటంచేత మగవాళ్ళతో ముఖాముఖిని మాట్లాడడానికి బిడియపడ తాను..."

ఈ మాట అంటూన్నప్పుడు ఆ అమ్మాయి ముఖంలో కొంచెం సిగ్గూ, కొంచెం వెగటూ, ఇంకా ఇలాంటివే ఏవేవో వ్యక్తమై, ఆమె నిజంగా మగవాళ్ళతో మాట్లాడడానికి బిడియ పడుతుందనే కోర్టువారికీ, కోర్టులోనివారికీ నమ్మకం పుట్టింది. జయలక్ష్మి—

"ఈ బిడియం మూలాన్ని నేను ఆడవాళ్లున్న చోటు ల్లోనే నా మందుల అమ్మకానికి ప్రయత్నిస్తాను. అంచేత ఆ వంటింట్లో స్త్రీలెవరైనా ఉన్నారేమోనని చూశాను. ఓ ముసిలాయన కూరలు తరుగుతూ కనపడ్డాడు. సత్రంలోనే మందులమ్మకం ప్రారంభించాలనుకున్న నాకు ముద్దాయి

బాపతు స్త్రీజనం ఎవరూ లేకపోవటం ఓ అపశకునంగా కనపడింది. అనుకున్నచోట వ్యాపారం మొదలెట్టక పోతే ఇంక ఆ ఊళ్ళో ఏమీ అమ్మకం జరగదనే నమ్మకం ఒకటుంది నాకు. నా కింతకుముందు చాలాసార్లు అలాంటి నిదర్శనాలు కనపడ్డాయి. అంచేత ఈమాటు ఆడవాళ్ళు లేకపోయినాసరే, ముద్దాయికి మందులు చూపిద్దామనే నిశ్చయించుకున్నాను. 'ఇంతకూ ఆడవాళ్ళ స్థానే ముసిలాయన ఒకడున్నాడుగా.' అన్న ధైర్యంతో వెళ్ళి ముద్దాయి యెదుట నిలబడ్డాను."

కోర్టువారికి ఆ అమ్మాయి అలసిపోయిందనీ, నిలబడి మాట్లాడలేకపోతోందనీ తోచి, "కూర్చుని మాట్లాడండి" అని అనుమతి ఇచ్చారు. కోర్టువారి సానుభూతికి కోర్టులోని వారంతా అభినందించారు. జయలక్ష్మి కూర్చొని—

"నా మందులన్నీ ఒక్కొక్కటే తీసి ముద్దాయి ముందు పెట్టేను. స్త్రీలముందు అవుతే ఒక్కొక్క మందు గుణం శ్లాఘించి చెప్పివుందును. కాని ముద్దాయికి అలా చెప్పలేక పోయాను. కారణం బిడియమే. ఇంతకూ అవసరం కూడా లేకపోయింది. ఏమంటే ప్రతీ సీసా మీదా, అందులో ఉన్న మందు పేరూ, అందులో పడ్డ సరుకులూ, ఆ మందుయొక్క గుణగణాలూ అచ్చువేసి ఉన్నాయి. ముద్దాయితో 'తమ కేవైనా మందులు అవసరమైతే దయచేసి పుచ్చుకోండి' అని మాత్రం కోరేను. ముద్దాయి ఒక్కొక్క సీసానే పరికించి, లేబిల్ మీద ఉన్నదంతా చదువుకుని తిరిగి ఇచ్చేశాడు. 'ఈయ నేమీ కొనేటట్లు లేడు' అని నే ననుకుంటుండగా, మరొక సీసా

తీసి, టేబిల్ మీాద ఉన్నది ఆమూలాగ్రంగా రెండుమార్లు చదువుకుని, 'ఏమండీ, నిజంగా యీా మందులో ఇంత గుణం ఉందంటారా?' అన్నాడు. నేను తక్షణమే, 'ఎందుకు లేదండీ? మా మందులన్నీ గుణం కనపరిచేవే. ఎప్పుడో కాదు. వెంటనే గుణం కనపరుస్తాయి. అందుకే కదండీ, మా కంపెనీకి 'సద్యో గుణౌషధాలయం' అని పేరొస్తే?' అన్నాను. ముద్దాయి మాట్లాడకుండా సీసా మూాత పెల్లగించి, ఓ మాత్ర తీసుకుని మింగేశాడు. లేచి గోడకు తగిలించిఉన్న కోటువైపు వెళ్ళేడు. సీసాను కొన నిశ్చయించుకున్నాడనీ, దానిబాపతు సొమ్ము తేవటానికి కోటువద్దకు వెడుతున్నాడనీ అనుకున్నాను. కాని—''

ఆ మాట పూర్తికాకుండానే ముద్దాయి ఐన ప్రకాశరావు ''నేను సొమ్ముకోసమే కోటుదగ్గరకు వెళ్లేనండి. కాని యీా లోపుగా...'' అని ఏదో చెప్పబోయాడు.

కోర్టువారు, ''సీవంతు వచ్చేవరకూ నువ్వు మాట్లాడకూడదు!'' అని కోప్పడ్డారు. ముద్దాయి ఆగిపోయాడు. జయలక్ష్మి మళ్లీ అందుకుంది :

''గోడవైపు వెడుతూన్న ముద్దాయి తటాల్న వెనక్కి తిరిగి, అదోరకమైన వెఱ్ఱిచూపుతో నాకేసి చూశాడు. 'ఏమిటిది?' అని నేను స్తంభించిపోయాను! చూస్తోండగానే ముద్దాయి రంగస్థలం మీాది విలన్‌లాగా మారిపోయి 'ప్రాణేశ్వరీ, మన్మథుడు నామీాద బాణాలు వేసేస్తున్నాడు! ఒక్క నిముషం కూడా తాళలేను! నన్ను అనుగ్రహించు' అంటూ ముందుకొచ్చాడు. నేను కంగారుగా వీధిలో కొచ్చి పడిపోయాను. ఆ

ముసిలి వంటాయన అడ్డుకోకపోతే ముద్దాయి ఏం అత్యాచారం చేసిఉండేవాడో!"

జయలక్ష్మిగొంతుకలో గద్గదిక వచ్చింది. కళ్లు నీరు గమ్మి, ఆమె చెరుమాలుతో అద్దుకుంది. చీదుకోవలసిన అవసరం ఉన్నట్లు కనపడిందిగాని, కోర్టుగదా అని సందేహించి కాబోలు ఆ పని చేయలేదు. కోర్టువారి సమక్షాన్ని మరిచిపోయి, కోర్టులోనివారు కలకలం మొదలెట్టేరు. కోర్టువారు వాళ్ళని మందలించి జయలక్ష్మితో—

"అట్లైతే ఆ ముసిలి వంటాయన మీ పక్షాన్ని సాక్ష్యం ఇస్తాడన్నమాట?"

"ఆ ముసిలి వంటాయన ఒక్కడేకాదు, సత్రంముందు అప్పుడు మూగిన జనం అంతా సాక్ష్యం ఇస్తారు."

ముద్దాయి ప్రకాశరావు అందుకుని, "సాక్ష్యం ఎందుకు? నేను నేరం వప్పుకుంటున్నాను" అన్నాడు.

ముద్దాయి ఇలా నేరం వప్పేసుకోడం కోర్టులోని వారందరికీ అసంతృప్తిగా ఉంది. ఇంక కేసులో రంజు ఏముంది? కోర్టువారికి కూడా చిరాకేసుకొచ్చి, "నీ టైము రాకుండా నువ్వెందుకు మాట్లాడతావు?" అని కోప్పడ్డారు. కోర్టువారలా కోప్పడ్డారేగాని, ముద్దాయి చెప్పుకోవలసిన టైము వచ్చేసింది. అంచేత కోర్టువారే మరుక్షణంలో "నువ్వు చెప్పుకోవలసిన దేమైనా ఇంకా ఉంటే చెప్పేసుకో. శిక్ష విధించేస్తాను" అన్నారు.

ముద్దాయి—

"యువర్ ఆనర్, ఫిర్యాది చెప్పినదంతా నిజం. ఆ వంటబ్రాహ్మణుడు అడ్డుకోకపోతే నేనీ అమ్మాయి అనుకున్నంత అత్యాచారానికి ఒడిగట్టేవాడినే! కనుక తాము నాకెట్టి శిక్ష విధించినా నిర్విచారంగా అనుభవిస్తాను... కాని ఆనాడు నా బుద్ధి అలా ఎందుకు గడ్డితిందో మాత్రం కోర్టు వారికి స్పష్టంగా మనవిచెయ్యటం అవసరం."

"చెప్పు, త్వరగా."

"ఈ అమ్మాయి చెప్పినట్లు, ఈవిడ తెచ్చిన సీసాలన్నిటిలోనూ నా కొక్కరకం మందే నచ్చింది. ఆ సీసా ఇప్పుడు నా జేబులోనే ఉంది. లేబిలు చిత్తగించండి. యువర్ ఆనర్!"

బెంచిక్లార్కు ముద్దాయి ఇచ్చిన సీసా అందుకున్నాడు. కోర్టువారి ఆజ్ఞ అయాక సీసామీది లేబిలు చదవటం మొదలెట్టేడు:

"రసికరంజని మాత్రలు... ఈ మాత్రలు సేవించిన యెడల జితేంద్రియులకు కూడా మదనవికారము పుట్టించి, ఉల్లాసము కలిగించును. 30 మాత్రల వెల మూడు రూపాయలు మాత్రమే."

ముద్దాయి మళ్లీ మనవిచేసుకున్నాడు: "ప్రస్తుతం నా వయస్సు ముప్పైఏళ్ళు మాత్రమే. నేను ఆరోగ్యవంతుణ్ణి అనీ, దృఢకాయుణ్ణి అనీ నన్ను చిత్తగిస్తూన్న కోర్టువారు గ్రహించే

ఉంటారు. మనవిచేసే దేమిటంటే, నాకు ప్రస్తుతం ఇలాంటి మందులసాయం ఏమీ అవసరం లేదు."

"మరి ఎందుకు కొనబోయావు?"

"మనవిచేస్తున్నా. యువరానర్! మగవా డెవడైనా ఈ మందులతో వస్తే, పంపించేసేవాడి నే. కాని, ఈ అమ్మాయిని అలా చిన్నబుచ్చి పంపటానికి మనస్కరించింది కాదు. అంతేకాకుండా 'అధికస్య అధికం బలం' అన్నట్లు, ఈ తమాషా ఏమిటో చూద్దామనికూడా అనిపించింది. లేబిలు మీద చెప్పినంతగా కాకపోయినా ఏదో కొంచెమైనా గుణం ఉండకపోతుందా అనిపించి తీసుకున్నాను. కాని నేను చేసిన పొరబాటేమిటంటే ఆ మాత్రలు నాలుగు అప్పుడే వేసుకోటం. రాత్రి కెలాగా ఇంటికి చేరుకుంటాం గదా అని వేసుకున్నా ననుకోండి! కాని వాని తస్సాదియ్యా! ఆ మాత్రలు వేసుకునీ వేసుకోటంతోనే పనిచెయ్యటం మొదలెట్టేయి! లేబిలు మీద రాసినది అక్షరాలా నిజమై ఊరుకుంది! లోగడ మనవి చేసుకున్నట్లు, నేను అసలైన వయస్సులో ఉన్నానేమో, ఇట్టే లొంగిపోయాను. ఫిర్యాదిని ఇప్పుడు చూస్తే పాతికేళ్ళ మనిషని అందరికీ తెలుస్తోనే ఉంది. కాని నాకుమాత్రం నిషాలో ఈ అమ్మాయి పద్ధెనిమిదేళ్ళ జవ్వనియై కనపడింది. మరోమాట. నా భార్యకన్న ఈవిడ వీసమెత్తు కూడా అందమైనదికాదు. ఐతేం? నా కప్పుడీమె రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ

నగ్నరా అందగత్తెలలోని అందమంతా తీసి, ఈ అమ్మాయిని తయారుచేశాడా బ్రహ్మ అనిపించింది. చెప్తే నమ్మండి! నేను పదహారణాల ఏకపత్నీవ్రతుణ్ణి. ఐతేం? నాలో ఒక్క మాటుగా కీచకుడికి, సైంధవుడికి, రావణాసురుడికి, ఇంద్రుడికీ పుట్టుకొచ్చిన మోహమంతా కలిసి ఉప్పెనగా వచ్చి, ఈ అమాయకురాల్ని వెంటాడించింది. ఆ ముసిలాయనే అడ్డుకోక పోతే ఏమి అత్యాచారం చేసి ఉందునో కదా!"

ముద్దాయి పశ్చాత్తాపంలో నిలవలేక మూర్ఛపోబోతే అటూ ఇటూ ఉన్న పోలీసులు పట్టుకు నిలబెట్టేరు. కోర్టువారు సానుభూతి కనబరుస్తూ, "కూర్చోబెట్టండి. కూల్ డ్రింక్ కావా లేమో కనుక్కోండి" అన్నారు. ప్రేక్షకులయొక్కా, మేజస్ట్రేటు గారియొక్కా సానుభూతంతా ఫిర్యాదినుంచి ముద్దాయి పైకి ఒక్కమాటుగా మళ్ళింది. 'ఆ స్థితిలో మనమూ ఈ నేరం చేసే ఉందుం' అనిపించింది వాళ్ళకి. మేజస్ట్రేటుగారు, ఈ కేసులో ఇంక దీర్ఘంగా ఆలోచించవలసిన దేమీ లేదన్నట్లు పరపరా నాలుగు పంక్తులలో తీర్పు రాసేసి, చదివేరు:

"ప్రత్యేక పరిస్థితులలో యీ నేరం జరిగింది గనుకనూ, ముద్దాయి పశ్చాత్తాపం కనపరుస్తున్నాడు గనుకనూ అతణ్ణి క్షమించి వదిలివేస్తున్నాను. సద్యోగుణం కల ఇలాంటి మందులను స్త్రీ ఏజంట్లు ఒంటరిగా ఉన్న పురుషులకు అమ్మటం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. ఫిర్యాది తన నియమాన్ని

మామూలు ప్రకారం ఇప్పుడుకూడా పాటించిఉన్నట్లయితే ఈ ఉపద్రవం రాకపోను. ఈమె ఇకముందు ఈ విషయంలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది.''

ప్రకాశరావు కోర్టు వారికి తన కృతజ్ఞత తెలియబరుచు తుంటూ హాలులోంచి బయటకు వెళ్ళిపోయాడు. ఇంక కేసుల్ని విచారించటానికి బదులు మేజిస్ట్రేటుగారు గద్దెమీదనుంచి లేచి బెంచిక్లార్కును రమ్మని సైగచేసి ప్రయివేటు రూముకు వెళ్ళి పోయారు. దానితో హాలంతా ఖాళీ ఐపోయింది.

ముద్దాయికి శిక్షపడలేదన్న విచారంతో కామోసు, జయలక్ష్మి కోర్టు హాలులోంచి అతి మెల్లగా బయట వరండా లోకి వచ్చి నిలబడింది. ఎందుకోగాని అక్కడ కూచుని మందుల బ్యాగు ఓమాటు తెరిచి, సీసాలను అక్కడివిక్కడా, ఇక్కడి వక్కడా సర్దింది. తాను సత్రంలో ముద్దాయికి ఎన్నోరకాల మందులసీసాలు చూపినట్లు కోర్టులో చెప్పిందేకాని, ఇప్పుడా బ్యాగును ఎవరైనా పరీక్షగా చూస్తే, 'రసికరంజని మాత్రలు' తప్ప మరొక మందేదీ అందులో లేదని తెలుసుకోగలరు. ఆవిడ కాస్సేపు ఆ వరండాలో అలా జాప్యంచేసి ఆఖరికేదో అసం తృప్తి కనపరుస్తో బ్యాగ్ పుచ్చుకు లేచి, వరండా మెట్లు దిగు తోంటే, వెనకనుంచి ఎవరో, "ఏమండోయ్, మిమ్మల్నే. ఆగండి'' అన్నారు.

వెనక్కి తిరిగి చూచేటప్పటికి బెంచిక్లార్కు ప్రత్యక్షమయాడు. అతడు మందహాసంతో, "ఆ సీసాలు మీ వద్ద ఉంటే ఒకటి ఇవ్వండి." అంటూ మూడు రూపాయిల నోట్లు ఆమె చేతిలో పెట్టేడు. వరండా చిగురుగదిలోంచి కనిపెడుతూన్న మరో గుమాస్తా, బెంచిక్లార్కు సీసా అందుకునే వేళకి ఏదో మించిపోయినట్లు చక్కా వచ్చి ఎగతాళిగా నవ్వటం మొదలెట్టేడు.

"నాక్కాదోయ్. మేస్ట్రీటుగారికి!" అన్నాడు బెంచిక్లార్కు.

అందుకు రెండో గుమాస్తా తీసిపోక, "నువ్వా? పడుచు పెళ్ళాం ఉన్న ముసిలి మొగుడివేగా! కొను ఓ సీసా!" అని హెచ్చరించాడు. బెంచిక్లార్కు కొనకుండా రెండో గుమాస్తాను తిడుతో చక్కా పోయాడు. ఆయన పోగా చూసి రెండోవాడు రెండు సీసాలు కొని పట్టుకుపోయాడు. అంతవరకూ మాటున ఉన్న బెంచిక్లార్కు మళ్ళీ వచ్చి అప్పుడు సొంతానికి కొనుక్కెళ్ళేడు. జయలక్ష్మి మందుసీసాల అమ్మకం ఇలా రహస్యంగా ఆరంభమైంది. కాని ఆమె వచ్చే పోయే వాళ్ళకీ రహస్యం బట్టబయలు చేసి, "కావలిస్తే మీరు కూడా తీసుకోండి. నే నీ ఊరు మళ్ళీ రాను" అనటం మొదలెట్టింది.

ప్రకాశరావు కోర్టునుంచి తిన్నగా సత్రానికి పోయి, సామానూ, బెడ్డింగూ సర్దేసుకున్నాడు. కాని ఎవరికోసమో

ఎదురుచూస్తో అక్కడే ఉండిపోయాడు. చాలాసేపు చూసి చూసి ఆఖరి కతనికి విసుగెత్తేవేళకి, ఓ జట్కాబండి వచ్చి సత్రంముందు ఆగింది. ఆ బండిలోంచి దిగుత, కోర్టులో ఫిర్యాది పాత్ర నటించిన జయలక్ష్మి! "ఏం మై డియర్, ఇంత ఆలస్యమైంది? సీసాలన్నీ అమ్ముడయాయా?" అన్నాడు ప్రకాశరావు.

"ఆ, బ్యాగు ఖాళీ ఐపోయింది. కావాలన్న వాళ్ళింకా పదిమంది మిగిలిపోయారు. మన నాటకానికి అనుకున్నట్లు సద్యఃఫలితం కనబడింది!"

ఆ దంపతులు నవ్వుకుంటూ సామానును బండిలోకెక్కించుకున్నారు. రసికరంజని మాత్రలకు సద్యోగుణం కాదు గదా, ఏ గుణం లేదని ఆ ఊరివాళ్లకు తెలియకపూర్వమే, వీళ్ళ జట్కా అక్కడనుంచి వెళ్లిపోయింది.